క్లుప్తంగా

అతిసార రాకుండా జాగ్రత్తలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్



మాచర్ల: పట్టణంలో అతిసార వ్యాధి పెరిగే సూచనలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉంచేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుని ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు చేయటం జరుగుతుందన్నారు. ప్రజలు అతిసార ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అందులో భాగంగా 1వ వార్డు నుంచి 31వ వార్డు వరకు మున్సిపాలిటీ నుంచి సరఫరా చేసే నీటిని వాడవద్దని, కూరగాయలు, బియ్యం కడిగేందుకు ఉపయోగించరాదన్నారు. వంటకు సైతం మున్సిపల్ కుళాయి నుంచి వచ్చే నీటిని ఉపయోగించటం వలన ఇబ్బంది పడే అవకాశముందన్నారు. కావున పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రేపటి నుంచి అమృత వర్షోత్సవాలు

మాచర్ల: బ్రహ్మర్షి సద్గురు ముసలయార్య దేశిక స్వామి వారి 135వ జయంతి సందర్భంగా 75వ అమృత వర్షోత్సవ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామంలోని జ్ఞానాశ్రమంలో నిర్వహించనున్నట్లు జ్ఞానాశ్రమ నిర్వాహకులు కాశీ విశ్వనాధస్వామి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 17న తొలిఏకాదశి రోజున స్వామి వారి జయంత్యుత్సవం, గురుపౌర్ణమి రోజున లలితా యజ్ఞం, 23న 75వ ఆరాధన, పూర్ణాహుతి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీలు, పీఠాధిపతులు, భక్తులు పాల్గొంటారన్నారు. అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమృత వర్షోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ



రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులకు ఆయన హెచ్‌ఎం బేబిరాణి, టీడీపీ నాయకులతో కలిసి స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

17న పంచలోహ విగ్రహాల ప్రతిష్ట

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ అతి పురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో పలు దేవతామూర్తుల ఉత్సవ పంచలోహ విగ్రహాలను తొలిఏకాదశి సందర్భంగా ఈ నెల 17న ప్రతిష్ఠించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవస్థానంలోని స్పటిక లింగానికి అభిషేక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు. భక్తులు అందజేసిన రూ.4 లక్షల ఆర్థిక సహాయంతో ఏడు పంచలోహ విగ్రహాలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు పంపించడం జరిగిందన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో షాపులకు టెండర్లు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎనిమిది స్టాల్స్‌ను అద్దెకు ఇచ్చేందుకు టెండర్లను పిలవటం జరుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెండర్లలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, వాటర్ స్టాల్, పాప్‌కార్న్ షాప్, ఐస్‌క్రీమ్ కూల్ డ్రింక్ షాపు, స్వీట్స్ అండ్ బ్యాకరీ, ఫ్యాన్సీ అండ్ జనరల్ షాపు, ఫ్రూట్స్ అండ్ జ్యూస్ వంటి 8 షాపులకు టెండర్లు ఆహ్వానించడమైంది. టెండర్ ఫారాలను 22వ తేదీ లోపు తీసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు నరసరావుపేట ఆర్టీసీ ఆఫీసులో స్వీకరించటం జరుగుతుందన్నారు. అదే రోజు 3 గంటలకు ఓపెన్ చేయటం జరుగుతుందని ఈ అవకాశాన్ని వ్యాపారాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హమ్మయ్య వర్షం కురిసింది



మాచర్ల: రైతులు, ప్రజలు అనేక రోజులుగా ఎదురుచూస్తున్నా.. వస్తున్నా వస్తున్నా అంటూ మబ్బులు.. చిరుజల్లులకే పరిమితమయ్యాయి. చాలా రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. చాలా రోజుల తరువాత సోమవారం భారీగా వర్షం కురిసింది. అనేక రోజులుగా ఎండలతో అల్లాడిన రైతులకు వర్షం కొంత ఊరట కలిగించింది. పలు చోట్ల రోడ్లపై నీరు చేరింది.

నిరుద్యోగ భృతి ఎప్పుడో..!?

- ఎన్నికల ప్రచారంలో ప్రతి ఒక్క నిరుద్యోగికి భృతి ఇస్తామని హామీ
- ఇచ్చిన హామీని విస్మరించిన చంద్రబాబు



యువతకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ (సర్కిల్లో)

గురజాల నెట్‌వర్క్ : ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో అలవి కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నెరవేర్చకుండా పలు కొర్రీలు పెడుతున్నారు. ప్రతి ఒక్క నిరుద్యోగికి నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు అమలు చేయడం లేదని పలువురు సామాజిక విశ్లేషకులు అంటున్నారు.

నియోజకవర్గంలో 3 లక్షలకు పైగా గృహాలు

నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో సుమారు 3 లక్షలకుపైగా గృహాలు ఉన్నాయి. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం లేక నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కానీ నిరుద్యోగ భృతికి కొన్ని కండిషన్‌లు పెట్టి ప్రతి ఒక్కరికి రాకుండా అర్హత లేకుండా అనర్హత కలిగే విధంగా నిబంధనలు తీసుకువచ్చారు. ఎంతో ఆశగా నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు. నిబంధనలు పెట్టడంతో ఎంతో మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రాదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతికి విధించిన నిబంధనలు సడలింపు చేయాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలు వెంకటరెడ్డి మృతి



పోలు వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోలు వెంకటరెడ్డి ఆదివారం సాయంత్రం మృతి చెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా పనిచేశారు. గతంలో గురజాలలోని షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం నగర పంచాయతీ చైర్మన్‌గా పోలు వెంకటరెడ్డి కోడలు పోలు పవన్మయి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

వెంకటరెడ్డి మృతికి సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే కాసు

పోలు వెంకటరెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. జంగమహేశ్వరపురంలోని వెంకటరెడ్డి స్వగృహంలో ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి ఫోన్‌లో వెంకటరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్యవరప్రసాద్‌లు వెంకటరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయభాను



మాచర్ల: వర్షాల వలన సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశముండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి రోగాలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయభాను అన్నారు. సోమవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశముందన్నారు. ఇప్పటికే డయేరియా పెరిగి కొంత ఆందోళనకు గురిచేస్తుందని, అయితే మాచర్లలో లేదన్నారు. దోమల వలన సోకే వ్యాధుల నియంత్రణకు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటి విషయంలో ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆమె కోరారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తు పెట్టుకుంటా

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల: కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తు పెట్టుకుంటానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని వల్లెల గార్డెన్స్‌లో కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన గెలుపు కోసం కృషి చేసిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను గుర్తు పెట్టుకుంటానని తెలియజేశారు. డయేరియా ప్రాంతంలో మంత్రితో పర్యటించానని, కార్యకర్తలు కూడా ఆ ప్రాంతంలో ఎక్కువగా పని చేశారని ఆయన తెలిపారు. గురజాల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలను కాపాడుకోండి

పిడుగురాళ్ల: హెల్మెట్‌తో ప్రాణాలను కాపాడుకోవచ్చని పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించటం వలన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయ స్థితి నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చని, దీనిని ప్రతి ద్విచక్ర వాహనదారు గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ధారా చెన్నయ్య, ఉడతా కోటేశ్వరరావు, ఎస్.వి.కోటేశ్వరరావు, పి.నవ్య, మోటమర్రి లోకేశ్వరి, పి.మాణిక్యం, రాజశేఖర్, ఏ సీతారామయ్య, ఏజీపీ బత్తుల దాసు, కంభంపాటి కోటేశ్వరరావు, ఎ.రూత్ బనియన్, కె.విశ్వనాథం, ఎస్కే మౌలాలి, ఈసా అచ్చారావు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



ఉపాధ్యాయులకు బహుమతి అందజేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీంద్రరాజు

దాచేపల్లి : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మనబడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వై.రవీంద్రరాజు అన్నారు. మండలంలోని కాట్రపాడు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం ఏర్పాటైన మన బడి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మారుమూల గ్రామమైన కాట్రపాడులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం, పాఠశాల అభివృద్ధి కోసం 2017లో మనబడి ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, దీని ద్వారా రూ.18 లక్షలు విలువ చేసే అభివృద్ధి పనులు, మౌలిక వసతులు పాఠశాలకు కల్పించామని, పాఠశాల అభివృద్ధి కోసం ఫౌండేషన్ తరపున పలువురు తోడ్పాటు అందించారని చెప్పారు. ఈ పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని, గ్రామ ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, షీబా, లక్ష్మీకోటేశ్వరరావు, త్రివేణి, శోభానాయక్‌లను సన్మానించి బహుమతులు అందజేశారు. కమిటీ సభ్యులు సాంబశివరాజు, సుధాకర్‌రాజు, బాబు, రాంగోపాల్‌వర్మ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి



మాచర్ల రూరల్: జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయకపోతే ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమిస్తాయని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి గంగాధర్ హెచ్చరించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటం దారుణమన్నారు. జీపీఎస్ కన్నా మెరుగైన విధానాన్ని తెస్తామని చెప్పిన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా గత ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ విధానాన్ని యథావిధిగా అమలు చేస్తామని చెప్పటం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలన్నారు. లేకపోతే జీపీఎస్ విధానంపై మరో పోరాటానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయటం తప్ప ప్రత్యామ్నాయం లేదని ఎస్టీయూ అంగీకరించబోదని స్పష్టం చేశారు.

తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం పంపిణీ



కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో సరోజనీదేవి

మాచర్ల: పట్టణంలో ప్రజల సౌకర్యార్థం కందిపప్పు, బియ్యం తక్కువ ధరలకు విక్రయించేందుకు పట్టణానికి చెందిన దాల్, బియ్యం మిల్లుల అసోసియేషన్ ముందుకు రావటం సంతోషకరమని తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో సరోజనీదేవిలు అన్నారు. పట్టణంలోని స్థానిక కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కందిపప్పు, బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో అసోసియేషన్ కందిపప్పు రూ.160, బియ్యం రూ.49కే విక్రయించటం మంచి చర్య అన్నారు. ఈ అవకాశాన్ని రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, గోళ్ళ జనార్ధన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై ఇంత నిర్లక్ష్యమా..!




డయేరియా ప్రాంతంలో కాలువలో చెత్తను తొలగిస్తున్న కార్మికురాలు

పిడుగురాళ్ల: పారిశుద్ధ్య కార్మికులపై అధికారులు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పట్టణంలో బలంగా వినిపిస్తున్నాయి. లెనిన్ నగర్, మారుతీ నగర్‌లో పారిశుద్ధ్య కార్మికుల చేత డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని ఎక్కువ గంటలు పని చేయిస్తూ వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా కాలువలో పూడికను తీయిస్తున్నారు. ఇటీవల ఓ మున్సిపల్ కార్మికుడు డయేరియా ప్రాంతంలో పని చేస్తూ డయేరియా సోకి చనిపోయాడు. అయినా కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించటం లేదు. కార్మికులకు సౌకర్యాలు కల్పించి వారి చేత పని చేయించాలి. అంతేకాకుండా వారికి సబ్బులు వంటివి అందించాలని అలాంటివి ఏమీ లేకుండానే వారి చేత పని చేయిస్తున్నారు. డయేరియా ప్రాంతంలో పని చేస్తున్న కార్మికులకు మంచి నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. లెనిన్ నగర్, మారుతీ నగర్‌లో డయేరియా అదుపులోకి వస్తుందంటే మున్సిపల్ కార్మికులు చేసిన పని అంతా ఇంతా కాదని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. కానీ వారికి అనారోగ్య సమస్యలు వస్తే పట్టించుకునే వారు లేరని, కనీస సౌకర్యాలు కూడా లేవని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ప్రజలతోపాటు, కార్మికులు కోరుకుంటున్నారు.

ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి

పిడుగురాళ్ల: ప్రతి విద్యార్థి మొక్కలు నాటే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని స్కాలర్స్ విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌రెడ్డిలు తెలిపారు. పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీలో సోమవారం ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంప్రదాయ డిగ్రీ కోర్సులు చదువుకుంటే సరిపోదని.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పరిశ్రమలకు కావాల్సిన ప్రతిభ కలిగిన నైపుణ్యాలు నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. కాబట్టి ప్రతి విద్యార్థి ప్రత్యేక నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ తరగతులకు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముందుగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్, సత్యం, నాయక్ క్రోసూరి శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించండి



తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల రూరల్: పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ఆర్టీసీ బస్సులను, ఇతర వాహనాలను నిర్ణీత ప్రదేశాలలో నిలుపుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి కోరారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు పెరిగిపోయాయని, కనీసం పాదాచారులకు జాగా దొరకటం లేదని, ఆవులు ప్రధాన రహదారులలోనే అడ్డంగా పడుకొని వాహనదారులను ఇబ్బందికి గురిచేస్తున్నాయన్నారు. ఆటో స్టాండ్, పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేసి పట్టణ ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు. అలాగే పట్టణంలోని ఖాళీ స్థలాల్లో చెట్లు ఇతర చెత్త పేరుకుపోతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని మరో అర్జీ అందజేసినట్లు తెలిపారు.

పశర్లపాడు గ్రామంలో రేషన్ షాపు సీజ్



రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఆర్ఐ కాంతారావు

రెంటచింతల: మండలంలోని పశర్లపాడు గ్రామం 26వ నంబర్ రేషన్ షాపులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి లబ్ధిదారులకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులలో వ్యత్యాసాలు గుర్తించి రేషన్ షాపును సీజ్ చేసినట్లు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మురళి సోమవారం తెలిపారు. రేషన్ లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. షాపులో ఉన్న నిత్యావసర సరుకులకు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన సరుకులకు, రికార్డులలో నమోదు చేసిన సరుకుల వివరాలకు తేడాలు ఉన్నాయన్నారు. దీంతో 1955 నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం 26వ నంబర్ రేషన్ షాపుపై 6ఏ కేసు నమోదు చేసి సీజ్ చేశామన్నారు. పూర్తి నివేదికను ఇన్‌చార్జి జేసీ వినాయకంకు పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులను కార్డుదారులైన లబ్ధిదారులకు అందజేయకుండా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే రేషన్‌షాపు డీలర్లపై కఠిన చర్యలు తీసుకుని షాపులను సీజ్ చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ మురళి హెచ్చరించారు. ఈ తనిఖీలలో మండల రెవెన్యూ అధికారి దాసరి కాంతారావు, వీఆర్వో అబ్దుల్ షుకూర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

దాచేపల్లి : నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఏడీఏ తుమ్మల వీరేశ్వరరావు చెప్పారు. నక్సల్ ప్రభావిత గ్రామమైన కేసానుపల్లిలో త్రీఫేజ్ కరెంట్ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఏడీఏ వీరేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ గ్రామంలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంబాలు, వైర్లు ఏర్పాటు చేస్తామన్నారు. త్రీఫేజ్ కరెంట్ అందుబాటులో ఉండటం వలన కుటీర, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉందని, దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. కేసానుపల్లితో పాటుగా నక్సల్ ప్రభావిత గ్రామాలైన రామాపురం, శ్రీనగర్, గామాలపాడు, సారంగపల్లి అగ్రహారం, మాదినపాడు, కొత్తూరు, తక్కెళ్ళపాడు, భట్రుపాలెం గ్రామాలకు కూడా త్రీఫేజ్ కరెంట్ పనులు చేపడతామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ఏఈ దండే నాగేశ్వరరావు, సర్పంచ్ శ్రీపతి ప్రసాద్, నాయకులు నెల్లూరి రామకోటయ్య, నెల్లూరి కోటయ్య, షేక్ జానయ్య, కోట సాయికుమార్, నెల్లూరి రామారావు తదితరులున్నారు.

యువత నైపుణ్యం పెంపొందించుకోవాలి



మాచర్ల: ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ఆవరణలో చక్రధర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఎం.ఉమామహేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో విధంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో మొదటి బహుమతి షేక్ సుల్తానా, ద్వితీయ బహుమతి బిందు మహేశ్వరి, మూడవ బహుమతి మరియ కుమారి, నాల్గవ బహుమతి ఆదర్శినిదేవి, చిత్రలేఖనంలో మొదటి బహుమతి పి.స్రవంతి, ద్వితీయ బహుమతి భవ్యశ్రీ, మూడవ బహుమతి భానుశ్రీ లేఖ, నాల్గవ బహుమతి భవాని ప్రసాద్‌లు సాధించారు. బహుమతులను కళాశాల యాజమాన్యం, డైరెక్టర్‌లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాణి, ప్రసన్న, దుర్గ, జ్యోతి పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి



మండాదిలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న హెచ్‌వో సురేష్

వెల్దుర్తి: నర్సరీ యజమానులు నర్సరీ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖాధికారి ఎస్.సురేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మండాది గ్రామంలో షేడ్‌నెట్ నర్సరీలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్ నెట్ చుట్టూ 8 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్‌సెక్ట్ నెట్ వేసి రక్షణ కల్పించాలన్నారు. షేడ్ నెట్ హౌస్‌లో డబుల్‌డోర్ సౌకర్యం కలిగి ఉండాలని, కీటకాలు లోపలకు ప్రవేశించకుండా నెట్‌కు ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు. మిరప విత్తనాలను ప్రో ట్రేలలో నాటి వాటిని ఎత్తైన మడులపై అమర్చాలన్నారు. ప్రో ట్రేలలో శుద్ధి చేసిన కోకోపిట్ మాత్రమే వాడాలన్నారు. నర్సరీ యజమానులు విత్తనాల ప్యాకెట్ మీద విత్తన రకం, లాట్ నెంబర్, కంపెనీ లేబుల్‌ను గమనించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఒరిజినల్ రశీదులను భద్రపరుచుకొని నర్సరీ రిజిష్టర్‌లలో నమోదు చేసుకోవాలన్నారు. లైసెన్స్ లేని వారు, కొత్తగా షేడ్ నెట్ నర్సరీలు వేసిన వారు, లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సిన వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులకు నాసిరకం, అధిక ధరలకు నారు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ లేకుండా మిరప నారు వేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నర్సరీల యజమానులు, రైతులు, సహాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధిక ధరలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఊరట



కందిపప్పు అందజేస్తున్న అధికారులు, మిల్లర్స్

దుర్గి: పెరిగిన కందిపప్పు, బియ్యం ధరలను ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజలకు తగ్గించి ఇచ్చేందుకు దాల్ అండ్ రైస్ మిల్ అసోసియేషన్ యజమానుల ఆధ్వర్యంలో తక్కువ ధరకు ఇచ్చేందుకు సన్నాహాలు చేసినట్లు సీఎస్‌డీటీ మురళి, డీటీ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన దుర్గిలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అడిగొప్పల శాఖ కింద పల్లె ప్రసాద్ షాపు ముందు నిత్యావసర వస్తువులు ప్రజలకు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్కువ ధరలకు ఇవ్వటం జరిగిందన్నారు. కందిపప్పు కేజీ రూ.160, బియ్యం రూ.49కే ఇవ్వటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కపలవాయి ప్రసాదరావు, శ్రీనివాసరావు, వేముల యోగేశ్వరరావు, గాలి శ్రీనివాసరావు తదితరులున్నారు.

మహారాజశ్రీ గురజాల 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
IA521/2018 in AS/2018
Between :
... పిటీషనరు/అప్పీలెంటు
మరియు
... రెస్పాండెంట్లు
... పిడుగురాళ్ళ(Po & Md), పల్నాడు జిల్లా
... వ.9 16 2024 వ తేదీకి వాయిదా వేసియున్నారు. ...
ఆచంట శ్రీనివాసరావు
పిటీషనరు తరుపు న్యాయవాది, గురజాల
ఫోన్: 9849031191

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com